International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.4, Issue-7, July, 2017
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# ప్రజల కోసం కాళోజి – ప్రజా కవిగా కాళోజి

**టంగుటూరి జానకి రాములు**

ఉస్మానియా విశ్వవిద్యాలయం

చరవాణి: 9703532413

"ప్రజాకవి" ఇది ఒక బిరుదు కాదు. కవి జీవన విధానం తెలిపే పదం. కవులు చాలా రకాలు. కానీ ప్రజాకవులు మాత్రం ప్రజల్లోంచి వారి ఆక్రందనల నుంచి పుట్టి ప్రజల కోసమే కవిత్వం రాస్తారు. అందువల్లే వారి జీవితాల్లో, రచనల్లో, ఆలోచనల్లో, ప్రేరణల్లో ప్రజలే ఉంటారు. వారి కవిత్వం ప్రజా జీవితాలకు అద్దం పడుతుంది.

ప్రజాకవుల నేపథ్యం సామాజిక ఉద్యమాలు. వీరి అక్షరాలు ధ్వనులుగా మారుమ్రోగుతాయి. వీరి గళం కలం కన్నా ఎక్కువగా సాహిత్య సృష్టి చేస్తుంది. ఇలాంటి విషయాలను 13వ శతాబ్దంలోనే పాటించిన పాల్కూర్కిని మొట్టమొదటి ప్రజాకవిగా చెప్పవచ్చు.

ప్రజాకవులు ప్రజల తరపున పోరాడతారు. ప్రజలబాగు కోసం రచనలు చేస్తారు. వారు పేరుకు ప్రాధాన్యం ఇవ్వరు. అచ్చు వేసుకోవడానికి ఆసక్తి చూపరు. అయినా వారి రచనలకు మరణం ఉండదు. ప్రజాదరణ మాత్రమే ఉంటుంది. అవి ప్రజల నాల్కలపై తాండవం చేస్తాయి.

కాళోజీ అంతే! అచ్చమైన ప్రజాకవి ఆయన రచనలకు అంతం లేదు. ఆయనకన్న సామాజిక స్పృహతో కవిత్వం నేటికీ ప్రజాదరణ ప్రాయమైంది. కాళోజీ పూర్తిపేరు రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరావు రాజారం కాళోజీ. "కాళోజీ నారాయణ రావు" అని పిలుస్తారు అందరూ!

కాళోజి 9-9-1914లో జన్మించాడు. హన్మకొండ హైస్కూలులో ఇంగ్లీష్ మీడియం నాల్గవ ఫారంలో ప్రవేశించే నాటికే ఆయనకు సమాజం మీద పూర్తి అవగాహన ఉంది. హైదరాబాద్‌లో చదువుకుని ఉర్దూ, మరాఠీ భాషల్లో మంచి వాక్పటిమను సంపాదించాడు.

కాళోజి స్థానిక సమస్యలపై పోరాటం చేసి ప్రజలతో అనుబంధాన్ని ఏర్పర్చుకున్నాడు. ఆయనపై ఆర్య సమాజం ప్రభావం కూడా ఉంది. తెలుగునాట మహర్షి దయానందుని మార్గంలో నడిచాడు కూడా. కాళోజీ ఆనాటి జాతీయోద్యమాలన్నింటిలో పని చేశాడు. గ్రంథాలయోద్యమంలో పాల్గొనటం వల్ల ఆయనకు ప్రముఖ తెలుగు కవులతో మంచి సంబంధాలు ఏర్పడ్డాయి.

కాళోజీని ప్రజాకవిగా గుర్తించటానికి ముఖ్యకారణం మాత్రం ఆయన రచించిన "నా గొడవ" కవి అది తన గొడవగా చెప్పినా ఇది మాత్రం ప్రజల గొడవ.

నిజాం నిరంకుశ పాలనకు ప్రజలు విసిగిపోయి ఎదురు తిరుగుచున్న రోజుల్లో కాళోజీ ఒక కవిగా "నా గొడవ"ను ప్రకటించారు. 'నా గొడవ' కవితా సంపుటంలోని కవితల సంఖ్య 67... నా గొడవ సంపుటిని శ్రీశ్రీ ఆవిష్కరించారు. కాళోజీ "నా గొడవను" తన అన్న రామేశ్వరరావుకు అంకితమిచ్చాడు. కాళోజీ నమ్మిన సిద్ధాంతాలే "నా గొడవ" కావ్యంలో కవితా వస్తువులు.

అసమ్మతి, నిరసన, ధిక్కారం లక్షణాలుగా, దేశభక్తి, వేదన, వాక్చాతుర్యం, వ్యంగ్యం, కొంచెం హాస్యం ప్రధాన అంశాలుగా నా గొడవ రచించారు.

కాళోజీ "నా గొడవ"లో వ్యత్యాసాలు అనే కవిలో
"అన్నపురాసులు ఒక చోట
ఆకలిమంటలు ఒక చోట"

అనే పంక్తుల ద్వారా సమాజంలో ఆర్థిక అసమానతలను చూపించాడు. ఇంకెన్నాళ్లు, ఆంధ్రుడు, ఓ రాజా, కాలగతి, ఓటిచ్చునప్పుడు, దీపావళి దీపాలు మొ॥ శీర్షికలతో కవి తన ఆవేదనను వ్యక్తం చేశాడు. ప్రజల మెదళ్లను ఉద్దిష్టం చేసేందుకు ప్రయత్నించాడు ఆంధ్రుడా అనే గేయంలో

ఏ భాషరా నీది యేమి వేషమురా?
ఈ భాష ఈ వేషమెవరి కోసమురా?
ఆంగ్లమందున మాటలాడ గలుగనే
ఇంతగా కుల్కెదవు ఎందుకోసమురా
తెలుగు బిడ్డవయ్యూతెల్గు రాదంచును
సిగ్గులేక ఇంక చెప్పుటెందుకురా?

అంటూ పరాయి భాషకోసం ప్రాకులాడే వారిని ప్రశ్నించాడు కాళోజీ

అభ్యర్థులై ఓటు అడిగేటి వారు
ఏమేమి జేసిరో ఎటువంటివారో?

అని ఓటిచ్చినప్పుడు అనే గేయంలో తెలియజేశారు ఈ ప్రజాకవి. ఓ రాజా! అనే గేయంలో అంతఃపురకాంతలతో ఆనందిస్తూ నిజాం రాజు రైతు సమస్యలను పట్టించుకోవటం లేదు. నగరాలను అభివృద్ధి చేస్తు, పల్లెలను నిర్లక్ష్యం చేస్తున్నావు.

అని ప్రశ్నిస్తూ ఈ విధంగా రాశాడు

''రాణివాసములోన రంజిల్లురాజా
రైతు బాదల దీర్చి రక్షింపలేవా!
పట్టణపు సొగసుకై పాటుబడు రాజా
పల్లెకందము గూర్చు ప్రతిభయే లేదా!''

'కాలగతి' అనే గేయంలో ఎన్ని ఉగాదులు వచ్చినా పేదల జీవితాలు మాత్రం మారటం లేదంటూ 1951 వికృతి నామ సం॥ర ఉగాది సందర్భంగా ఈ విధంగా అన్నాడు

''ఆ యేడు పోతేమి
ఈ యేడు వస్తేమి
మా ఏడు పేదియో
మాతోడనే ఉండ''

1944 వ సం॥లో జనగామ, నల్లగొండ ప్రాంతాల్లో రైతు కూలీలపై జరుగుతున్న దౌర్జన్యాన్ని దృష్టిలో ఉంచుకొని రాసిన గేయం 'ఇంకెన్నాళ్లు'

''కంచెయే చేను మేయుచుండగా
కాంచకుండుట ఇంకెన్నాళ్లు?
దొంగలు దొంగలు ఊళ్లు పంచుకుని
దొరలై వెలిగేది ఎన్నాళ్లు''

ఆనాటి పరిస్థితులకు ఇది మచ్చుతునకగా చెప్పవచ్చు. ''మాతృదేశం'' అనే గేయం స్వాతంత్రోద్యమంలో ఒక భాగం. ఇది దేశబక్తిని ప్రబోధిస్తుంది ఈ గేయాన్ని 26-05-1943 నాడు హైదరాబాదులోని రెడ్డి హాస్టల్లో జరిగిన 10వ ఆంధ్ర మహాసభ సమావేశంలో, ఆంధ్ర సారస్వత పరిషత్ స్థాపనోత్సవం రోజున కాళోజీ వినిపించారు. ఈ కవిత ద్వారా ఆయన మాతృదేశం ఎడారి అయినా, అన్నం దొరక్కపోయినా, బట్ట యివ్వక పోయినా మాతృదేశాన్ని విడవకు. ఏది ఏమైనా మాతృదేశం

మాతృదేశమే. దాన్ని మించింది వేరే ఏది లేదు అని పేర్కొన్నారు. ''నరుడను నేను, నిరుడను నేను'' అనే కవితలో ''నేనునవ్వుతాను, నేను ఏడుస్తాను, ఎందుకంటే నేను నరుడను కాబట్టి. నవ్వూ ఏడ్పు అనుభూతికి సంబంధించిన అంశాలే... అంటూ అత్యంత వైవిధ్యంగా కాళోజీ ''నా గొడవ'' లోని కవితలు కొనసాగుతాయి. అందుకు కారణం - దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో, తెలంగాణా రైతాంగ ఉద్యమంలో, నిజాం వ్యతిరేక పోరాటంలో ప్రముఖ పాత్ర వహించి తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకున్నాడు కాళోజీ. ప్రతి గేయంలో పోరాటం కన్పిస్తుంది. రాజకీయ చైతన్యం దాగి ఉంటుంది.

'నవయుగంబున నాజీవృత్తుల
నగ్ని నృత్య మింకెన్నాళ్ళు
పోలీసు అండను దౌర్జన్యాలు
పోషణ బొందేదెన్నాళ్ళు
కంచెయే చేను మేయుచుండగా
కాంచకుండుటింకెన్నాళ్ళు' అంటూ ప్రశ్నించాడు.

ఆయన జీవితం తెరచిన పుస్తకం... ఆయన జీవితం ప్రజల కోసం. ఆయన జీవితం ప్రజలకంకితం.

అన్యాయాన్నెదిరిస్తే
నా గొడవకు సంతృప్తి
అన్యాయం అంతరిస్తే
నా గొడవకు ముక్తి ప్రాప్తి
అన్యాయాన్నెదిరించి నోడు
నాకు ఆరాధ్యుడు అన్నాడు కాళోజి నా గొడవలో ఆయన తన గురించి నా గొడవ గురించి ఈ విధంగా అన్నాడు.

నేనంటే తిరుగుబాటు దారు
నా గొడవ మన తిరుగుబాటు...

కాళోజికి ప్రజల భాషయైన మాండలిక మంటే ఎనలేని ప్రేమ. ఎవరి మాండలికంలో వారు రాయాలని, రాయాల్సిన అవసరాన్ని తెలియజేశారు. అంతేకాదు ఆయన తెలంగాణా కావాలని రావాలని

ఎంతో కాంక్షించారు.. ప్రజల్ని ప్రతీ విషయంలో చైతన్యవంతులను చేయటమే కాళోజి ముఖ్య ఉద్దేశ్యం... తెలంగాణా కోసం ఆయన రాసిన ఈ క్రింది గేయం ఒక ఉదాహరణ మాత్రమే.

"పదరా పదరా పోదాం పదరా
తెలంగాణా సాధిద్దాం పదరా
దొంగల దూరం కొడదాం పదరా
వేరే రాజ్యం చేద్దాం పదరా.."

ఇంత గొప్ప రచనలు చేసినప్పటికీ కాళోజీ లోని కవి కన్నా ఉద్యమకారుడు అన్నది అంతే నిజం మరి...

ఉద్యమకారుడు, కవి అయిన కాళోజీ భాష విషయంలో కూడా అనేక ప్రయోగాలు చేశాడు... ఈయన రచనలన్నీ ప్రజల వాడుక భాషలోనే ఉండేవి. సాధారణంగా తెలంగాణ ప్రాంతంలో కన్పించే ఉర్దూ పదాలను ఈయన తన కవిత్వంలో విరివిగా వాడేవాడు... తెలుగుదనంతో పాటు పలుకుబడులు, నుడికారాలు కన్పిస్తాయి... కాళోజి చెప్పే విషయం సూటిగా, స్పష్టంగా ఉండాలంటాడు. కొత్తపదాలను కూర్చాలనే ఆలోచన సర్కస్‌ఫీట్ల వంటిదని కాళోజి భావన

"భాష గురించి ఆయన మాటల్లోనే
వ్యాకరణం రాజబాట వేస్తుంది
వాడుక పిల్లబాట తొక్కుతుంది
సమ్మతీరూప దర్శనాభిలాషి పండితుడు
అగుపడ్డ రూపమే సమ్మతము సామాన్యునికి
ఎవనికో నచ్చునట్లు పలకటం నాడు
ఎవనికి వాడు వచ్చినట్లు పలకడం ఖాయం నేడు"

కాళోజి సాంప్రదాయకమైన విశ్వాసాల కథా వృత్తాంతాన్ని స్వీకరించి నేటి అవసరాలకు అనుగుణంగా మార్చి చెప్పటం కనపడుతుంది.

తెలంగాణ ప్రాంత అవసరాలు ఏమిటో పట్టించుకోకుండా తమ స్వార్థానికే ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని, వారిది సవతి తల్లిప్రేమ అని కాళోజీ నినదించారు.

కాళోజీ ప్రజాకవి అయినందున ఆయన జీవితం ప్రజలకంకితం. ఆయన రచనలు ప్రజల కోసమే ఆయన తన 89 ఏళ్ళ జీవితంలో బాల్యంలో ఎప్పుడో నిదానంగా ఉండవచ్చు

కానీ మిగతా జీవన పర్యంతం ఆయన భాషకై, యాసకై, దాస్యవిముక్తికై, తెలంగాణా కొరకై చివరి వరకు పోరాటం చేస్తూనే ఉన్నాడు. ఆయన పోరాటం అజరామరం... ఆయన చరిత్ర సముద్రం ఆయన మాటలు మొద్దుబారిన మెదళ్ళను చైతన్యపరిచే ఉద్దీప్తి కలిగించే దీపాలు.

**ఆధార గ్రంథాలు:**

1) నా గొడవ - కాళోజి

2) 1969 తెలంగాణ ఉద్యమం - కాళోజీ కవిత్వం ప్రొ. బన్న ఐలయ్య

3) ప్రజాస్వామ్యంలో అధికృత హింస - ప్రజాస్వామ్య కవిగా కాళోజి నిరసన - డా॥ తూర్పు మల్లారెడ్డి

4) సలాం తెలంగాణ - కర్ర ఎల్లారెడ్డి

5) ప్రజాకవి కాళోజీ సాహిత్య సమాలోచన - డా. గంటా జలంధర్ రెడ్డి.